క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులు పెద్దమ్మ దర్శనం చేసుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, చిన్నన్న, చిన్నపెద్దన్న మాట్లాడుతూ జూన్ 8,9,10 తేదీల్లో పెద్ద అమ్మవారి దేవర నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 11న ముడుపు కడుతున్నందన అమ్మవారికి జంతు బలులు, మొక్కులకు నిషేధిస్తున్నట్లు తెలిపారు.

మండపాలను బాగుచేయండి


పశువుల పేడతో నిండిపోయిన మండపం

దొర్నిపాడు: మాన్యం భూముల ద్వారా ఆలయాలకు ప్రతి ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా వాటి అభివృద్ధికి నిధులు వెచ్చించడం లేదు. మండల కేంద్రం దొర్నిపాడులోని గణాధిపతి చౌడేశ్వరీ దేవి ఆలయానికి సుమారు 23 ఎకరాల మాన్యం భూమి ఉంది. దీంతో ప్రతి ఏటా రూ.7లక్షల వరకు ఆదాయం వస్తుంది. కానీ ఆలయం ఎదురుగా ఉన్న మండపాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. లోపలకు పశువులు వెళ్లి అపరిశుభ్రం చేస్తున్నాయి. ఎక్కడ చూసినా పేడతో నిండిపోయింది. దీంతో ఎండపొద్దున కాసేపు కూర్చోవడానికి వీలు లేక పోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండపం చుట్టు ప్రహరీ కట్టడంతో పాటు మండపాల అభివృద్ధికి చొరవ చూపాలని భక్తులు కోరుతున్నారు.

అకాల వర్షంతో తీవ్ర నష్టం


పెనుగాలులకు లేచిపోయిన వేర్‌హౌస్ సిమెంట్ రేకులు

ఆళ్లగడ్డ: వరుస పెట్టి కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు నష్టాల పాలవుతున్నారు. చేతికొచ్చిన వరి, మిరప పంటలు ఇంటికి చేరకుండానే దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా బత్తలూరు గ్రామంలోని వెంకటసుబ్బారెడ్డికి చెందిన ఉమామహేశ్వర రూరల్ వేర్‌హౌస్ పైకప్పు రేకులు గాలివానలకు లేచిపోయాయి. దీంతో సుమారు రూ.40 లక్షల విలువ చేసే వరి, శనగ ధాన్యం తడిసిపోయాయి. దీంతో నిల్వ ఉంచుకున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంతటి గాలులు గతంలో ఎన్నడూ లేదని..జరిగిన నష్టానికి ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కర్షకులు,బాధితులు కోరుతున్నారు.

ఫీ'జులుం'కు వ్యతిరేకంగా పోరాటం

కర్నూలు(సెంట్రల్): కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సెలవు దినాల్లోనూ ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నా బోర్డు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అన్యాయమన్నారు. నిబంధనలు అతిక్రమించిన కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన యూనివర్సిటీలు, నిధులపై కనీసం రాష్ట్రం ప్రశ్నించడం లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం, డిప్యూటీ సీఎం ప్రశ్నించడం లేదన్నారు. కార్యక్రమంలో బాలాజీ, షామీర్ అబ్దుల్లా, సామెల్ వీరాంజనేయులు, జగదీష్ పాల్గొన్నారు.

'దేవుడా' శతకం ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: తెలుగు సారస్వత వైభవం ఆధ్వర్యంలో ఆచార్య గుబ్బా బాలస్వామి రచించిన 'దేవుడా' శతకం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, తెలుగు సారస్వత వైభవం అధ్యక్షుడు గొర్రెడ్డి హరిశ్చంద్రారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మంచి రచనల ద్వారా సంస్కార వంతులైన యువతను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నన్నయ్య, తిక్కన, పోతన, శ్రీశ్రీ లాంటి మహనీయుల రచనలు నేటి సమాజానికి ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రమౌళిని, ఆరేపల్లి వరలక్ష్మి, తొగట సురేష్ బాబు, ముద్రిక భాస్కర్ మాట్లాడారు. సాహితీ వేత్తలు, కవులు, రచయితలు, పాల్గొన్నారు.

అడ్మిషన్..అటెన్షన్!

- ముందస్తు అడ్మిషన్లతో జాగ్రత్త
- ఆకట్టుకునే ప్రచారాలు నమ్మి మోసపోవద్దు
- పాఠశాలల గురించి తెలుసుకున్నాకే చిన్నారులను చేర్పించాలి
- రిజిస్ట్రేషన్, గుర్తింపుపై ఆరా తీయాలి
- క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారో లేదో పరిశీలించాలి



నంద్యాల(న్యూటౌన్): 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని విద్యా సంస్థలు అడ్మిషన్ల వేట ప్రారంభించాయి. నూతన బ్రాంచ్‌లు ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. పలు హంగులు, ఆర్భాటాలతో తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రచారాలు చేస్తూ ప్రవేశాల ప్రక్రియ చేపడుతున్నాయి. జిల్లాలో మూడు వందలకు పైగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలున్నాయి. జిల్లా కేంద్రమైన నంద్యాలతో పాటు ఆత్మకూరు,ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, నందికొట్కూరులో ఏటా కొత్త పాఠశాలలు పుట్టుకొస్తున్నాయి. వీటిలో చాలా వాటికి అనుమతులు లేవు. విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఆయా విద్యా సంస్థలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఫీజుల రూపంలో పిల్లల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయి. మరి కొన్ని విద్యా సంస్థలు ముందుగా అడ్మిషన్ తీసుకుంటే ఫీజులో రాయితీ ఉంటుందని మభ్యపెడుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల ప్రారంభించాలంటే విద్యా శాఖ అనుమతి తీసుకోవాలి. మొదట ఓపెనింగ్ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తి స్థాయి అనుమతి పొందాల్సి ఉంటుంది. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యా మండలి అనుమతి కావాలి. ఈ నిబంధనలు పాటించని పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.

వీటిపై ఆరా తీయండి

ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపు పొంది ఉండాలి. గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలి. ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యా సంస్థల తరఫున పరీక్షలు రాయిస్తుంటాయి. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థులుగా పరిగణిస్తుంది. ఇలాంటి విషయాల్లో జాగ్రత్తలు అవసరం.

ఫిర్యాదు చేయవచ్చు



ప్రైవేటు యాజమాన్యంలో ప్రారంభించే ప్రతి పాఠశాలకూ ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలుంటే జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చు. అటువంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటాం. కొత్తగా పాఠశాలలు ప్రారంభిస్తే పూర్తి అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే అడ్మిషన్లు చేపట్టాలి. ప్రభుత్వ గుర్తింపును తల్లిదండ్రులు తప్పనిసరిగా పరిశీలించుకోవాలి.

– జనార్దన్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

- పిల్లలను చేర్పించే ముందు ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందో లేదో తల్లిదండ్రులు చూసుకోవాలి.
- ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగం జారీ చేసిన పాఠశాల భవనం నాణ్యత ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి.
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్లు, నీటి సదుపాయం ఉందో లేదో చూడాలి.
- విద్యార్థులు మానసిక, శారీరకోల్లాసానికి ఉపకరించే ఆటస్థలం, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారో లేదో ఆరా తీయాలి.

ఈ జాగ్రత్తలు అవసరం

- అర్హత గల ఉపాధ్యాయులు బోధిస్తున్నారా లేదా అనే విషయం తెలుసుకోవాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. హైస్కూల్ అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉండాలి.
- విద్యా సంస్థల బస్సులకు రవాణా శాఖ సామర్థ్య పరీక్ష పత్రం జారీ చేస్తుంది. సుశిక్షితులైన డ్రైవర్ తప్పనిసరి.
- జీ+1 భవనాలుంటే అగ్నిమాపక పరికరాలు, ఆ స్థాయి దాటితే మంటలను నియంత్రించే పూర్తి స్థాయి వ్యవస్థ ఉండాలి. సంబంధిత విభాగం నుంచి అనుమతి ఉండాలి.
- ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి. చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, టీసీలు జారీ చేయాల్సి ఉంటుంది.
- ప్రభుత్వ అనుమతి లేని వాటిలో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడి బయట ఉన్న వారిగా పేర్కొంటారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య విద్యార్థినీ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి వడ్డీ లేని రుణాలు అందించారు. ఆదివారం ఆ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో అధ్యక్షుడు సముద్రాల మధుసూదనరావు, గౌరవాధ్యక్షుడు గోపాలకృష్ణమూర్తి, కార్యదర్శి పెసల శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన వాసవీ జయంతి సందర్భంగా రెండు చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ చేసేందుకు తీర్మానించినట్లు తెలిపారు. అలాగే పదవ తరగతి, ఇంటర్, డిగ్రీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెరిట్ అవార్డులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, విద్యానిధి అధ్యక్షుడు సురేష్‌బాబు, హనుమంతరావు, వెంకటేశ్వరరావు, మధుసూదన్, ప్రవీణ్, కుమార్, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల్లో జిల్లా ఎడ్ల ప్రతిభ

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో పట్టాభిరామస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరా హోరీగా సాగాయి. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు మేళతాళాలతో, శాలువ, పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. నంద్యాల జిల్లా సంజామల మండలం ఆకుమళ్లకు చెందిన కాకర్ల నాగజ్యోతి ఎడ్లు 4,444 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా కోసూరు మండలం బయ్యవరానికి చెందిన కడియం మణికంఠ ఎడ్లు 3,918 అడుగులు, నంద్యాల జిల్లా రోళ్లపాడుకు చెందిన డాక్టర్ పేరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎడ్లు 3,750 అడుగులు, గిద్దలూరు మండలం ముళ్లపాడుకు చెందిన కంచర్ల తనీష్ ఎడ్లు 3750 అడుగులు, కంభం మండలం ఎర్రబాలేనికి చెందిన వెంకటగిరి హేమలతానాయుడు ఎడ్లు 3328 అడుగులు దూరం లాగి రెండు, మూడు, నాలుగో స్థానంలో నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.12,500, రూ.12,500, రూ.5 వేల నగదు బహుమతులను దప్పిలి బ్రదర్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ కన్వీనర్ మల్లెల శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దప్పిలి రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ బుగ్గారెడ్డి, నాయకులు రామిరెడ్డి, సిద్దారెడ్డి, కాశిరెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేత కేపీ నాగార్జునరెడ్డి

రమణీయం.. వేంకటేశ్వరుని రథోత్సవం

ఓర్వకల్లు: ఉయ్యాలవాడ గ్రామంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వాముల వారి రథోత్సవం రమణీయంగా సాగింది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లె నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున రథోత్సవం వైభవంగా నిర్వహించారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ తదితరులు శనివారం రాత్రి రథాన్ని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శశిధర్ శర్మ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి, రథోత్సవానికి సిద్ధం చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో అధిష్టింపజేసి భాజాభజంత్రీలు, డప్పుల మధ్య రథశాల వద్దకు చేర్చారు. రథశాల వద్ద క్రతువులు పోసి రథాంగహోమం, కుష్మాండబలి సమర్పించి స్వాముల వారిని రథంపైకి చేర్చారు. అశేష భక్త జన సందోహం మధ్య తరలిపోతున్న రథంపైకి భక్తులు పూలు, పండ్లు విసురుతూ కరచాల ధ్వనులతో గోవింద నామస్మరణ చేశారు. అనంతరం స్వాముల వారి రథాన్ని ముందుకు కదిలించి, స్థానిక సుంకులమ్మ గుడి వరకు వెళ్లిన రథాన్ని తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ సునీల్ కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆకట్టుకున్న 'ఉట్ల' ప్రదర్శన

వేంకటేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా అనాదిగా వస్తున్న «ఉట్ల» ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కుమ్మరి కులస్తులు వెదురు బొంగులకు వేలాడదీసిన ఉట్లపై కుండలను ఉంచుతారు. యాదవ కులస్తులు వేలాడుతున్న కుండలను కర్రలతో కొడుతుండగా కుమ్మరి వాళ్లు కుండలకు తగలకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తారు. చివరకు యాదవులే జయిస్తారు. స్థానిక కృష్ణుడి దేవాలయం, రథశాల, వీరభద్రస్వామి దేవాలయం వద్ద ఉట్ల ప్రదర్శన నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం వివిధ అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధిగా నియమితులైన షేక్ హఫీజ్ మహమ్మద్ ఇలియాస్, రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీగా నియమితులైన షేక్ యూనిస్ బాష ఆదివారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయన్నారు. పదవులు పొందిన వారందరూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయానికి అనుగుణంగా పని చేసి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


కాటసాని రాంభూపాల్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న షేక్ మహమ్మద్ ఇలియాస్

అవీ-ఇవీ

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

మినీ లారీ బోల్తా

ఓర్వకల్లు: జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం లారీ బోల్తా పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి స్ప్రైట్ బాటిళ్ల లోడ్‌తో మినీ లారీ బేతంచెర్లకు బయలుదేరింది. మినీ లారీ కర్నూ లు – చిత్తూరు జాతీయ రహదారిపై ఓర్వకల్లు సమీపాన తిప్పాయపల్లె క్రాస్ రోడ్డు వద్ద ముందుగా వెళుతున్న ఆటోను తప్పించబోయి డివైడర్‌ను ఢీ కొట్టడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కురుమూర్తి చేతికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి లారీని పక్కకు తరలించారు. గాయపడిన డ్రైవర్ కురుమూర్తిని చికిత్స నిమి త్తం హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలుకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షలు విరాళం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు రూ.3 లక్షల విరా ళం అందించారని ఈఓ రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధిలో భాగంగా ముచ్చుమర్రి కాటం రఘునాథరెడ్డి, శిల్పల కుమారుడు సూర్యచంద్రారెడ్డి రూ.లక్ష, తాటిపాడు గ్రామానికి చెందిన రాయపు రామచంద్రారెడ్డి, శృతిల కుమార్తె సాన్వి రూ.లక్ష, అలాగే పారుమంచాల గ్రామానికి చెందిన మందడి సుబ్బారెడ్డి, సూర్యకళావతమ్మల కుమారుడు నరేంద్రనాథ్‌రెడ్డి రూ.లక్ష విరాళంగా అందించారన్నారు. ఈ నగదును కాంట్రాక్టర్‌కు చెల్లించడం జరిగిందన్నారు. అనంతరం దాతలచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి, శేషవస్త్రాలు అందించినట్లు తెలిపారు. అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంఘం సమావేశం

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో జరిగింది. సమావేశంలో ప్రముఖ రంగస్థల కళాకారులైన లొద్దిపల్లె అల్లాబకాష్, ఎన్టీఆర్ అవార్డు గ్రహీతలు బీసీ కృష్ణ, ఎస్.శ్రీనివాసులు చిత్రపటాలను తెలుగు వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి, సంఘం అధ్యక్షుడు గుర్రపుసాల అంకయ్య ఆవిష్కరించారు. అంకయ్య మాట్లాడుతూ.. మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను పార్క్‌గా మార్చడంతో కళాకారుల ప్రదర్శనలకు వేదిక లేకుండా పోయిందన్నారు. కళాకారులు ఐక్యంగా ఉండి కళా వేదికను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు పొందిన సంగీత విద్వాంసులు డాక్టర్ భగవాన్ ప్రకాష్ బాబును సన్మానించారు. కళాకారులు దస్తగిరి, కళాప్రియ తిరుపాలు, బైలుప్పల షఫీ, డాక్టర్ సభాన్, వీవీ రమణారెడ్డి, హనుమంతరావు చౌదరి, సయ్యద్ రోషనలి, సీబీ అజయ్ కుమార్, టీ రాజశేఖర్‌రావు, గోవిందరాజులు, పార్వతయ్య, అరుణ కుమారి, ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల విద్యార్థుల సంక్షేమానికి పాటుపడదాం


నూతన కమిటీతో నేతలు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన దూదేకుల విద్యార్థుల సంక్షేమానికి పాటుపడదామని దూదేకుల సంఘం రాష్ట్ర నాయకు లు సిద్దయ్య అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని దూదేకుల నూర్‌బాషా ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశం గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగింది. అసోసియేషన్ నాయకుడు కన్నయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బాబన్, మహమ్మద్ పాల్గొని ఉద్యోగుల సమస్యలు, సంక్షేమం గురించి చర్చించారు. దూదేకుల సంఘం అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలన్నా రు. దూదేకుల విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో అందరూ బాగుండాలని, అందులో దూదేకుల వర్గం ఉండాలనే సంకల్పంతో నేతలు, సభ్యులు పని చేయాలన్నారు. అనంతరం నంద్యాల జిల్లా దూదేకుల ఉద్యోగ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మౌలాలి, దస్తగిరి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జమాల్‌బాషా, కోశాధికారిగా అబ్దుల్ జలీల్, కార్యవర్గ సభ్యులుగా రఫీ, చిన్న దస్తగిరి, అసాన్, నాగూర్‌వలి, మహబూబ్‌బాషా, ఫకృద్దీన్, మహిళా కార్యదర్శిగా ఉమాభారతిని ఎన్నుకున్నారు.

దివ్యాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి


జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గంతో సమావేశమైన నాయకులు

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం కొత్తగా పెన్షన్లు మంజూరు చేయాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, అధ్యక్షుడు రమణయ్య అన్నారు. ఆదివారం ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడిగా రవికృష్ణ, గౌరవ సలహాదారుగా వెదుర్ల రామచంద్రరావు, అధ్యక్షుడిగా ఎంపీవీ రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా రామలింగం, కోశాధికారిగా రామకృష్ణ, సలహా మండలి సభ్యులుగా డాక్టర్ మధుసూదనరావు, ఏవీఆర్ ప్రసాద్, లాలిస్వామి, షేక్షావలి రెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌గా హనీఫ్ ఖాన్, ఉపాధ్యక్షులుగా సుబ్బారెడ్డి, వెంకటరావు, అవుకు రంగడు, రంగస్వామి, సంయుక్త కార్యదర్శులుగా ఇంతియాజ్, మధు కుమార్, వీరభరతుడు, మహిళా విభాగం కన్వీనర్‌గా కళ్యాణి, ఉద్యోగస్తుల విభాగం కన్వీనర్‌గా రామ కిశోర్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా చలపతి, శ్రీనివాసులు, దుర్గారావు, కిరణ్ కుమార్, నబీరసూల్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు మాట్లాడారు. దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు తమ బడ్జెట్‌లో విధిగా ఐదు శాతం దివ్యాంగుల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ స్థలాలలో ర్యాంపులు ఏర్పాటు చేయాలని, అంత్యోదయ కార్డులు అర్హత కలిగిన దివ్యాంగులకు మంజూరు చేయాలని కోరారు. అలాగే అవసరమైన వారికి మూడు చక్రాల సైకిళ్లు, స్కూటర్లు, చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు ఇతర ఉపకరణాలు అందజేయాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవం



అర్ధరాత్రి జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి దేవి అమ్మవారు

కొత్తపల్లి: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరి దేవి దేవాలయంలో అమ్మవారి జ్యోతుల ఉత్సవం ఆదివారం భక్తులు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముందుగా అమ్మవారిని పూల మాలలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. శనివారం రాత్రి 12 గంటల సమయం నుంచి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతులను మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వెలసిన సోమేశ్వర స్వామి ఆలయం నుంచి గ్రామ నలుమూలల గ్రామ పురోహితులు యాదవేని లక్ష్మీ నరసయ్య శర్మ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చౌడేశ్వరిదేవి అమ్మవారికి జ్యోతుల సమర్పించడంతో కార్యక్రమం ముగిసింది. అమ్మవారిని దర్శించుకోనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసుకున్నారు.

భక్తులతో మహానంది కిటకిట


రుద్రగుండం కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరులు భక్తులతో నిండిపోయాయి. పుణ్యస్నానాల అనంతరం భక్తులు ఉచిత, శీఘ్ర దర్శనం, అభిషేకం, స్పర్శ దర్శనం ఆర్జిత సేవా టికెట్ల ద్వారా శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లతో పాటు కోదండ రామాలయం, వినాయకనంది, గరుడనంది క్షేత్రాలను సందర్శించి నందివిగ్రహం వద్ద చెట్ల కింద సేదతీరారు.

మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా నరాల మౌళీశ్వరరెడ్డి !

- నిరాశలో ఆశావహులు

మహానంది: మహానంది దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా మసీదుపురం గ్రామానికి చెందిన నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి పేరును శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఖరారు చేసినట్లు టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. దీంతో మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా పోటీ పడిన, పదవిని ఆశించిన పలువురు నేతలు నిరాశకు లోనయ్యారు. మసీదుపురం, తమ్మడపల్లె, గాజులపల్లె, తిమ్మాపురం గ్రామాలకు చెందిన పలువురు చైర్మన్ పదవిని ఆశించారు. అయితే మౌళీశ్వరరెడ్డి పేరే ప్రధానంగా వినిపిస్తూ వచ్చింది. దీంతో స్వయంగా ఎమ్మెల్యేనే పేరు ప్రకటించడంతో ఆశిస్తున్న వారి ఆశలకు బ్రేక్ పడింది. మండలంలో కొందరికి, నంద్యాల పట్టణంలో ఒకరికి, వెలుగోడు, బండిఆత్మకూరు, ఆత్మకూరు మండలాల నుంచి ఇద్దరికి ధర్మకర్తలుగా ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఎంపిక విషయంలో ఎప్పుడూ కేవలం ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి కట్టబెడుతూ వస్తున్నారని, మిగిలిన ఓసీల్లో, బీసీల్లో ముఖ్యమైన నేతలు లేరా, ఆ వర్గాల వారు పార్టీకి చేస్తున్నవి సేవలు కావా అంటూ పలు సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జూపాడుబంగ్లా: సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. ఆదివారం రాత్రి మండలకేంద్రమైన జూపాడుబంగ్లా సంతగేటు ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్‌చేసి ఆధార్, బ్యాంకు, పాన్ నంబర్లు అడిగితే ఇవ్వొద్దన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికే వారిని నమ్మి వారిచేతుల్లో డబ్బులు పెట్టి మోసపోవద్దన్నారు. రూ.50వేలు, రూ.లక్ష పెట్టుబడి పెడితే అతి తక్కువ సమయంలో అంతకు రెండింతల డబ్బులిస్తామని చెప్పేమోసగాళ్ల మాటలు నమ్మవద్దని సూచించారు. గ్రామాల్లో ఏదేనా సమస్య వస్తే వెంటనే పోలీసుస్టేషన్‌కు వెళ్లి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఆవేశానికి లోనై తొందరపడి ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ లక్ష్మినారాయణ, ఏఎస్ఐ సంజీవయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్